సాక్షి విజయనగరం

గురువారం । 31 । జూలై । 2025



జిల్లాకు జ్వరమొచ్చింది..!

జిల్లా ప్రజలను జ్వరాలు వణికిస్తున్నాయి. గత వారం రోజులుగా ప్రభుత్వాస్పత్రులకు జ్వరపీడితుల తాకిడి పెరిగింది.

- 8లో



పైప్‌లైన్‌పై రైతుల అభ్యం

హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్ ఏర్పాటుకు భూములు ఇవ్వలేమని ఎల్.కోట మండలంలోని శ్రీరాంపురం, కొట్యాడ, కూర్మవరం గ్రామాల రైతులు తేల్చిచెప్పారు.

- 8లో



అన్నదాత సుఖీభవలో కోత

రైతన్నకు పెట్టుబడి సాయం అందించడంలో కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. కొర్రీలతో లబ్ధిదారుల సంఖ్యకు కోతపెడుతోంది.

- 8లో

న్యూస్‌రీల్

మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరంఫోర్ట్: స్వచ్ఛభారత్ మిషన్ కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని 147 అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లను ఆగస్టు 15 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. తన చాంబర్‌లో మరుగుదొడ్ల నిర్మాణంపై వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్షించారు. మరో 74 కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు ప్రతిపాదనలు పంపించామని సూచించారు. ఒకటి రెండు రోజుల్లో వీటికి అనుమతి తెప్పిస్తామని తెలిపారు. 144 అంగన్‌వాడీ కేంద్రాలకు ఆగస్టు 20వ తేదీలోగా నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఆగస్టు మొదటి వారానికి 31 అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ టి.విమలారాణి, ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ ముప్వ లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కవిత, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణ లక్ష్యం రూ.283 కోట్లు

- స్త్రీనిధి ఏజీఎం చిట్టిబాబు



మాట్లాడుతున్న స్త్రీనిధి ఏజీఎం చిట్టిబాబు

రామభద్రపురం: జిల్లాలో మహిళా సంఘాల సభ్యుల జీవనోపాధి మెరుగుకోసం స్త్రీనిధి కింద రూ.283 కోట్ల రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని ఏజీఎం వై.చిట్టిబాబు తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వీఓఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు సద్వినియోగం చేసుకునేలా రుణాలు మంజూరు చేయాలని, వంద శాతం రికవరీ చేయాలని సూచించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో సుమారు 40 వేల డ్వాక్రా సంఘాలున్నాయన్నారు. ఇప్పటి వరకు స్త్రీనిధి కింద రూ.89 కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. ఒక్కో సభ్యురాలికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం ఇస్తామన్నారు. నూటికి నెలకు 92 పైసలు వడ్డీ పడుతుందన్నారు. సకాలంలో చెల్లిస్తే అధిక వడ్డీభారం ఉండదన్నారు. మహిళలు చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే స్త్రీనిధి ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ మేనేజర్ రమేష్, ఏపీఎం మోహన్, సీసీ సింగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆటోమ్యుటేషన్



టి.ఉపేంద్రరావు, జిల్లా రిజిస్ట్రార్

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఆస్తులు (ఇల్లు, అపార్ట్‌మెంట్, ఖాళీ స్థలాలు) రిజిస్ట్రేషన్ అయిన వెంటనే ఆటోమ్యుటేషన్ జరుగుతుందని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్ టి.ఉపేంద్రరావు తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజిస్ట్రేషన్, మున్సిపల్ అర్బన్ అడ్మినిస్ట్రేషన్ శాఖ అనుసంధానంతో ప్రజల సౌకర్యార్థం తప్పులులేని డేటాతో ప్రజలే నేరుగా ఆస్తి వివరాలను నమోదు చేయడం, బాకీ పన్నులు, మ్యుటేషన్ రుసుములను నేరుగా ఆన్‌లైన్‌లోనే చెల్లించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్టు వెల్లడించారు. ఆటోమ్యుటేషన్‌తో నకిలీ పత్రాలు, భూ వివాదాలకు చెక్ చెప్పవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



గర్భాం సమీపంలో బిళ్లలవలస రోడ్డును ఆనుకుని నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ

ఇల్లేది బాబూ..!

- నూతన గృహాలు, స్థలాల మంజూరులో కూటమి నిర్లక్ష్యం
- సొంతింటి భాగ్యానికి దూరంగా పేదలు
- జిల్లా వ్యాప్తంగా ఇళ్లకోసం 36,559 మంది దరఖాస్తు
- అధికారంలోకి వచ్చి 13 నెలలైనా పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఆవేదనలో లబ్ధిదారులు





విజయనగరం గృహనిర్మాణశాఖ జిల్లా కార్యాలయం

మెరకముడిదాం:

‘అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టమైన హామీ ఇస్తున్నాం.. సొంతింటి భాగ్యం కల్పిస్తామని చెబుతున్నాం.. ఈ హామీ అమలు చేయడంలో ఎలాంటి రాజీపడబోం.. పేదల సంక్షేమమే ఈ చంద్రన్న సంకల్పం’ అంటూ ఎన్నికల ప్రచార సభల్లో ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఇది నిజమే అని పేదలు నమ్మారు. ఓట్లేసి గెలిపించారు. ఇల్లు మంజూరుకోసం విజయనగరం జిల్లా వ్యాప్తంగా సుమారు 36,559 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఏడాదిగా ఇల్లు ఎప్పుడు మంజూరవుతుందా అని ఎదురు చూస్తున్నా కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. ఇళ్ల స్థలాల కోసం వేలాది మందికి ఎదురుచూపే మిగులుతోంది. ఇళ్ల మంజూరై ఓ ప్రకటన కూడా చేయకపోవడం లబ్ధిదారులను ఆవేదనకు గురిచేస్తోంది. చంద్రబాబును నమ్మి మళ్లీ మోసపోయామన్న మాట లబ్ధిదారుల నుంచి వినిపిస్తోంది.

నాడు పక్కా లే అవుట్లు వేసి...

గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇల్లు లేని పేదలను సచివాలయం యూనిట్‌గా గుర్తించింది. వారికోసం నివాసయోగ్యమైన స్థలాలు సేకరించింది. సకల సదుపాయాలతో పక్కా లే అవుట్లు వేసింది. స్థలాలు కేటాయించి ఇల్లు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక లబ్ధితో పాటు రాయితీపై నిర్మాణ సామగ్రిని సమకూర్చింది. పేదల కోసం ప్రత్యేకంగా ఊళ్లను తలపించేలా కాలనీల నిర్మాణాలు చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు గడిచినా పేదల కోసం ఒక్క మంచి పని చేయలేదని, పక్కా ఇంటి భాగ్యాన్ని దూరం చేస్తోందంటూ లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే సంక్షేమ పథకాలను అటకెక్కించిదని, అమరావతి నిర్మాణం తప్ప పేదల గూడు గోడు కూటమి ప్రభుత్వానికి వినిపించడంలేదంటూ వాపోతున్నారు.

ప్రభుత్వ అనుమతులు వస్తే మంజూరు చేస్తాం

జిల్లా వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాల కోసం 36,559 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే ఈ దరఖాస్తుల విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వ ఆదేశాలు వస్తే ఇల్లు మంజూరు చేస్తాం.

– జి.మురళీమోహన్‌రావు, ప్రాజెక్టు డైరెక్టర్, గృహనిర్మాణశాఖ, విజయనగరం

జిల్లా వ్యాప్తంగా ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులు ఇలా..

మండలం	దరఖాస్తుల సంఖ్య		
		గజపతినగరం	1.063
మెరకముడిదాం	1,481	గంట్యాడ	1.042
రేగిడి ఆమదాలవలస	3,075	దత్తిరాజేరు	1.027
సంతకవిటి	2,545	విజయనగరం(అర్బన్)	999
బొబ్బిలి	2,229	బొండపల్లి	977
రాజాం	2,076	చీపురుపల్లి	928
గుర్ల	1,762	శృంగవరపుకోట	915
మెంటాడ	1,616	డెంకాడ	663
వంగర	1,605	భోగాపురం	634
పూసపాటిరేగ	1,585	వేపాడ	561
తెర్లాం	1,502	విజయనగరం (రూరల్)	416
రామభద్రపురం	1,377	లక్కవరపుకోట	390
నెల్లిమర్ల (రూరల్)	1,324	కొత్తవలస	378
గరివిడి	1,280	రాజాం(అర్బన్)	273
జామి	1,236	నెల్లిమర్ల(అర్బన్)	262
బాడంగి	1,112	బొబ్బిలి(అర్బన్)	226



మెరకముడిదాంలో వెలసిన జగనన్న కాలనీ

పీ–4 కార్యక్రమం ఓ బూటకం



రేగిడిలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్, తదితరులు

రేగిడి: పేదరిక నిర్మూలనకోసం కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న పీ–4 కార్యక్రమం ఓ బూటకమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. రేగిడిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పీ–4 కార్యక్రమంలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని, గ్రామస్థాయిలో పూర్తిగా అట్టర్‌ప్లాప్ అయిందని ఎద్దేవా చేశారు. మార్గదర్శకులను గుర్తించకుండా బంగారు కుటుంబాలను గుర్తించాలని అధికారులపై ప్రభుత్వం ఒత్తిడి తేవడం మంచిది కాదన్నారు. గ్రామస్థాయిలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులను బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని వేధించడం తగదన్నారు. అట్టడుగున ఉన్న పేద ప్రజలను బాగుచేయాలనే మంచి ఉద్దేశం ప్రభుత్వానికి ఉంటే కూటమి పార్టీల నాయకులే ఆ కుటుంబాలను దత్తత తీసుకోవాలని డిమాండ్ చేశారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు కాకపోవడం, ప్రజలు కూటమి నేతలను నిలదీస్తుండడంతో వారి దృష్టిని మరల్చడానికి పీ–4 కార్యక్రమం ముందుకు తెచ్చారన్నారు. గిన్నిస్‌బుక్ రికార్డు కోసం విశాఖలో ఇటీవల నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం మాదిరిగా ముఖ్యమంత్రి చంద్రబాబు రికార్డుల కోసం పీ–4 కార్యక్రమం చేపడుతున్నారని విమర్శించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్మోహనరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చిరిగిన బ్యాగులు.. చిన్నారులకు బాధలు

విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్ల పేరుతో కూటమి ప్రభుత్వం అందించిన స్కూల్ బ్యాగులు మూన్నాళ్లముచ్చటగా మారాయి. ఇచ్చిన నెలరోజులకే చిరిగిపోయాయి. వీటిలో పుస్తకాలు తీసుకెళ్లేందుకు చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వీటిని చూసిన తల్లిదండ్రులు బాబూ.. బ్యాగుల డాబు చూడు అంటూ వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు.

– రాజాం సిటీ/రామభద్రపురం/బొబ్బిలిరూరల్



బొబ్బిలిరూరల్: బ్యాగులు ఇలా... పుస్తకాలతో చిన్నారులు ముందుకెళ్లేదెలా?



రామభద్రపురం: చిరిగిన బ్యాగులతో వెళ్తున్న రామభద్రపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు



రామభద్రపురం: నాణ్యతలేని బ్యాగుల్లో పుస్తకాలు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న రామభద్రపురం పూడివీధి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు



రాజాం సిటీ: చిరిగిన బ్యాగు.. లాగేస్తోంది చూడు..



రామభద్రపురం: చిరిగిన బ్యాగులు చూపిస్తున్న చొక్కాపు వీధి మోడల్ ప్రైమరీ స్కూల్ చిన్నారులు

ఎన్‌పీసీఐ తప్పనిసరి

పార్వతీపురం రూరల్: అన్నదాత సుఖీభవ పథకం పొందేందుకు రైతులు బ్యాంకుల వద్ద ఎన్‌పీసీఐ చేయించుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో దాదాపు 14 వందల మంది రైతుల ఎన్‌పీసీఐ వివరాలు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఎన్‌పీసీఐ పెండింగ్ ఉన్న రైతుల వివరాలు గ్రామ రైతు సేవా కేంద్రంలో ఉన్నాయని ఆయన తెలిపారు. రైతులకు బ్యాంకు అధికారులు సహకరించాలని సూచించారు.

ఈవీఎం గొడౌన్ పరిశీలన

జిల్లా కేంద్రంలోని ఈవీఎం గొడౌన్‌ను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పత్రానికో రూటు.. సంతకానికో రేటు!

- రాజాం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లలో అవినీతి దందా
- ప్రైవేట్ ఫైనాన్స్‌లు, ఆస్తి హక్కుల కోసం అక్రమ రిజిస్ట్రేషన్లు!
- పుట్టుకొస్తున్న తప్పుడు సర్వేనంబర్ పత్రాలు



రాజాం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

‘సంతకవిటి మండలంలో ఓ గ్రామానికి చెందిన స్థలం కోర్టు వివాదంలో ఉండగానే రాజాం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ మార్టుగేజ్ రిజిస్ట్రేషన్‌కు రాజాంలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ రూ.6 లక్షల రుణం ఇచ్చింది. ఇదెలా సాధ్యమైందని ఆరాతీస్తే రాజాం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రైటర్లు, కార్యాలయం ఉద్యోగుల ప్రమేయంతో తప్పుడు సర్వే నంబర్‌తో పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ తంతును పూర్తి చేశారు. అక్రమపద్ధతిలో రుణం పొందేందుకు అవసరమైన రిజిస్ట్రేషన్ పత్రాల కోసం లబ్ధిదారుడు ఎక్కువ మొత్తం ముట్టజెప్పినట్టు తెలిసింది.’

రాజాం:

రాజాం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పత్రానికో రూటు, రేటు ఉంటుంది. ఎవరైనా రిజిస్ట్రేషన్ నిమిత్తం ఇక్కడకు వస్తే ముందుగా రైటర్లను సంప్రదించాలి. వీరి ధర వీరికి చెల్లించిన అనంతరం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అన్నీ సక్రమంగా ఉన్నా ఏదో ఒక కొర్రీ అక్కడి అధికారులు నుంచి వస్తుంది. ఆ కొర్రీ నుంచి తప్పించుకుని రిజిస్ట్రేషన్ కావాలంటే ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్‌తో సంబంధంలేని ఓ వ్యక్తి రంగంలోకి దిగి ధర నిర్ధారిస్తారు. ఆ పత్రాల ఆధారంగా రేటు నిర్ణయిస్తాడు. ఆ మేరకు అదనపు చెల్లింపులు జరిపితే పనవుతుంది. లేదంటే రిజిస్ట్రేషన్‌కు కొర్రీలు తప్పవు. ఎవరైనా గట్టిగా ప్రశ్నిస్తే అధికార పార్టీ నేతల అండదండలు తమకు ఉన్నాయంటూ కార్యాలయంలో ఉన్నవారు హూంకరించడం పరిపాటిగా మారిపోయిందంటూ పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.



సంతకం లెక్కన డబ్బుల వసూలు..

ఇక్కడ రైతు వారి పొలాలు దగ్గర నుంచి ఇంటి స్థలాలు, గ్రామ కంతాలు, జిరాయితీ భూమి.. ఇలా ఏదైనా సరే ఆయా ధ్రువీకరణ పత్రాల్లోని సంతకాలు, సాక్షుల సంతకాలు ఆధారంగా రేటు నిర్ధారిస్తారు. గ్రామ కంతాల్లోని ధ్రువీకరణ పత్రాలు ఆధారంగా రిజిస్ట్రేషన్లు కావాలంటే అందులో వీఆర్వో ధ్రువీకరణ పత్రం ఉంటే రూ.10 వేలు, తహసీల్దార్ ధ్రువీకరణ సంతకం ఉంటే రూ. 5వేలు రిజిస్ట్రేషన్ చలానా కంటే అదనంగా చెల్లించాలి. ఇవి రైటర్‌తో సంబంధంలేనివి. రైటర్ వద్ద వీటికి మరో ప్రత్యేక ధర ఉంటుంది. అక్కడ రిజిస్ట్రేషన్లకు సాక్షులు వారే సిద్ధం చేస్తే ఒక ధర, లబ్ధిదారులు ఎవరినైనా తీసుకొస్తే ఇంకో ధర ఉంటుంది. ఇవి కాకుండా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు తీసుకొస్తే ఒక ధర, రైటర్లే సిద్ధంచేస్తే వేరే ధర ఉంటుంది. వీటికి భయపడి నిజమైన హక్కుదారులు కూడా రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు.

షరా‘మామ్ముళ్లే’..

గత కొంతకాలంగా రాజాం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సాగుతున్న అడ్డగోలు మామూళ్ల వ్యవహారాలు సోషల్ మీడియా వేదికగా హల్‌చల్ చేస్తున్నాయి. రైటర్ల నుంచి కార్యాలయంలోని ప్రధాన ఉద్యోగి, సిబ్బంది వరకూ ప్రతి ఒక్కరిపైనా సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలు విచ్చలవిడిగా రాజాంలో ఏర్పడి రుణాలు ఇస్తుండడంతో ఇంటి స్థలాలు, పొజిషన్ సర్టిఫికెట్ల రిజిస్ట్రేషన్‌కు డిమాండ్ పెరిగింది. లేని ఆస్తి, ఇళ్లు ఉన్నట్లు, కొత్త సర్వేనంబర్లతో రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి. వీటికి రూ.15 వేలు నుంచి రూ.25వేలు వరకు అనధికార వసూలు చేస్తున్నట్టు సమాచారం. జిల్లా ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై దృష్టిసారించి, అక్రమ రిజిస్ట్రేషన్లతో పాటు అక్రమ వసూళ్ల నిలువరించాలని పలువురు కోరుతున్నారు.

సబ్ రిజిస్ట్రార్ ఏమన్నారంటే..

ఇక్కడ గతంలో ఇలా అక్రమ రిజిస్ట్రేషన్లు, తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్లు జరిగేవి. మేం వచ్చిన తరువాత వాటిని నిలువరిస్తున్నాం. పొజిషన్ సర్టిఫికెట్ల విషయంలో వీఆర్‌ఓలు, తహసీల్దార్లు ఇక్కడకు రావాల్సి ఉంటుంది. అలా లేని సమయంలో ప్రత్యామ్నాయంగా ధ్రువీకరణ పత్రాలపై ఎంక్వైరీ చేస్తున్నాం. తప్పుడు సర్వే నంబర్లను గుర్తించలేకపోతున్నాం. ఎవరి వద్దా మేం నేరుగా డబ్బులు వసూలు చేయడం అనే ప్రసక్తిలేదు. గిట్టనివారు మాపై ప్రచారం చేస్తున్నారు.

– కె.వేణు, సబ్‌రిజిస్ట్రార్, రాజాం

దత్తత తీసుకోవడం సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం ఉద్యోగులకు స్వచ్ఛందమేనని, ఎలాంటి ఒత్తిడి తేవడం లేదని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పష్టం చేశారు. అదొక సామాజిక బాధ్యతగా గుర్తించి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఇతర మండల, డివిజన్ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సమావేశంలో పీ–4, సీజనల్ వ్యాధు లు, వ్యవసాయం, పెన్షన్ల పంపిణీపై సమీక్షించారు. జిల్లాలో ఇప్పటికే 67,066 బంగారు కుటుంబాలను గుర్తించామని, మూడు రోజుల్లో సర్వే పూర్తి చేసి, వారి వాస్తవ అవసరాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. శనివారం నాటికి ఈ జాబితాను అందజేయాలని స్పష్టంచేశారు. దానికి అనుగుణంగా మార్గదర్శకులను గుర్తించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీరు సరఫరా, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కాలువల్లో తాగునీటి పైపులైన్లు లేకుండా చూడాలని ఆదేశించారు. సాధారణ యూరియాకు బదులుగా నానో యూరి యా వినియోగాన్ని పెంచాలన్నారు. జిల్లాలో నానో యూరియా 12,000 బాటిళ్లు అందుబాటులో ఉన్నట్టు వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ చాంబర్ నుంచి జేసీ ఎస్.సేతుమాధవన్, సీపీఓ పి.బాలాజీ, జెడ్పీ సీఈఓ బి.వి.సత్యనారాయణ, డిప్యూటీ సీఈఓ రామన్, డీఆర్‌డీఏ పీడీ సావిత్రి, డీఎంహెచ్‌ఓ జీవనరాణి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దేశం కోసం మధ్యవర్తిత్వం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి ఎం. బబిత

విజయనగరం లీగల్: మధ్యవర్తిత్వం అనే ప్రక్రియ చాలా సులువైనది, ఖర్చు లేనిదని ప్రజల్లోకి దాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ అధ్యక్షురాలు ఎం. బబిత అన్నారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ న్యూఢిల్లీ వారి ఆదేశాలతో బుధవారం జిల్లా కోర్టు చాంబర్‌లో మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారం కోసం కోర్టు కాంప్లెక్స్‌లో ఉన్న న్యాయమూర్తులంతో భౌతిక సమావేశం, ఇతర ప్రాంతాల్లో ఉన్న న్యాయమూర్తులతో వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ బృహత్తర కార్యక్రమం దేశవ్యాప్తంగా 90 రోజుల పాటు నిర్వహిస్తున్నారన్నారు. ముఖ్యంగా మనోవర్తి కేసులు ప్రమాద బీమా కేసులు గృహ హింస కేసులు, చెక్ బౌన్స్ కేసులు, వాణిజ్యపరమైన తగాదా కేసులను సులువుగా ఈ మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు.

విద్యార్థికి పాముకాటుపై విచారణ



ఆశ్రమ పాఠశాలలో విచారణ చేస్తున్న ఐటీడీఏ పీఓ శ్రీవాస్తవ, డీఈ సంతోష్ కుమార్

సాలూరు రూరల్: మండలంలోని తోణాం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి మంగళవారం పాముకాటుకు గురైన విషయమై ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ బుధవారం తోణాం ఆశ్రమ పాఠశాల వార్డెన్ లచ్చయ్యను విచారణ చేశారు. విద్యార్థి బయటకు వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందన్న విషయంలో పాఠశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, స్నానానికి నీళ్లు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు బయటకు వెళ్లాల్సి వస్తోందని ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వార్డెన్ తెలిపారు. డీఏ జుగా నిధులతో పాఠశాలలో అభివృద్ధి పనులు చేపడతామని విచారణ అనంతరం పీఓ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నెల్లిమర్ల రూరల్: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని చంపావతి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను వీఆర్‌ఓ వెంకట్రావు బుధవారం పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణాపై తహసీల్దార్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పంప్ హౌస్ సమీపంలో తవ్వకాలు జరుపుతున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ తవ్వకాలు జరుపుతున్న వ్యక్తికి జరిమానా విధిస్తామన్నారు. సొంత అవసరాలకు మాత్రమే ఎడ్ల బండ్లపై ఇసుకను తరలించే వీలుందని, భారీ వాహనాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఐటీడీఏ పీఓ దృష్టికి తాగునీటి సమస్య

పాచిపెంట: మండలంలోని కొత్తవలస గ్రామంలో తాగునీటి సమస్యను గ్రామస్తులు సబ్‌కలెక్టర్, ఇన్‌చార్జ్ ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ్ దృష్టికి తీసుకువచ్చారు. బుధవారం కొత్తవలస గ్రామానికి వచ్చిన ఐటీడీఏ పీఓ గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ క్రమంలో గతకొన్ని నెలలుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని , ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు తెలపగా పక్కనే ఉన్న ఎంపీడీఓతో ఆయన మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. గ్రామ సమీపంలో గల చెరువులో లార్వా దోమలపై డ్రోన్ ప్రయోగాన్ని, స్థానిక పత్తి పంటలో డ్రోన్ ద్వారా ఎరువుల పిచికారీని పరిశీలించారు.కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరారైన చిట్టీల నిర్వాహకురాలు

పార్వతీపురం రూరల్: పట్టణంలోని కొత్తవలస మణికంఠ కాలనీకి చెందిన చిట్టీల నిర్వాహకురాలు వారణాసి జయలక్ష్మి పరారైనట్లు ఆమె వద్ద చిట్టీ కట్టిన బాధితుల ద్వారా బయటపడింది. సుమారు రూ.రెండు కోట్ల వరకు ఆమె టోపీ పెట్టినట్లు గుసగుసలు వినిపిస్తుండగా 45మందికి రూ.90లక్షల మేర బాకీలు ఉన్నట్లు ఐపీ నోటీసులు పంపించడంతో ఒక్కసారిగా ఆమె పరారైన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తన ఆస్తి రూ.రెండు లక్షల వరకు ఉంటుందని, అది తప్ప తన వద్ద ఇంకేమీ లేవని ఐపీ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిసింది. చిట్టీల నిర్వహణలో ఆమెకు సహకరించిన బంధువులు కూడా ఇటీవల పరారీలో ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు. ఇదే ప్రాంతంలో గత 15 సంవత్సరాలుగా ఆమె చిట్టీల నిర్వహిస్తోంది. అయితే అకస్మాత్తుగా పరారీ కావడంతో కాలనీవాసుల్లో ఆందోళన మొదలైంది. చిట్టీల బాధితులు ఎంతమంది? ఎంతమేరకు నష్టపోయారనేది తేలాల్సి ఉంది.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్‌డ్	స్కిన్‌లెస్
₹107	₹184	₹194

జిల్లాకు జ్వరమొచ్చింది..!

- మంచాన పడిన జనం
- ఎక్కడా కానరాని ఫీవర్ సర్వే
- పట్టించుకోని అధికారులు



ఈ ఫొటోలో మంచంపై ఉన్న మహిళ పేరు సింహాచలం. ఈమెది మెంటాడ మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ పరిధి జీడికవలస. జ్వరంతో మూడు రోజులుగా మంచంపైన ఉంటోంది. ఈమెతో పాటు మరి కొంత మంది లోతుగెడ్డ పంచాయతీ పరిధిలోని ఏడు గిరిజన గ్రామాల్లో జ్వరాలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్ విభాగం వద్ద చికిత్స కోసం వచ్చిన జ్వరపీడితులు

విజయనగరం ఫోర్ట్: జిల్లావ్యాప్తంగా అనేక మంది జ్వరాల బారిన పడి బాధపడుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధుల వ్యాప్తి అధికంగా ఉంటోంది. ముఖ్యంగా వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు అధికంగా వ్యాప్తి చెందుతున్నాయి. వ్యాధులను అదుపు చేయాలంటే సకాలంలో వాటిని గుర్తించగలగాలి. డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు సకాలంలో చికిత్స అందించగలిగితే ప్రాణాపాయం నుంచి తప్పించడానికి అవకాశం ఉంటుంది. జ్వరపీడితులను త్వరగా గుర్తించాలంటే ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలి. కాని కూటమి ప్రభుత్వంలో ఫీవర్స్ సర్వే ఎక్కడా జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జ్వరపీడితులను గుర్తించడంలో అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆస్పత్రులకు వెళ్తున్న జ్వరపీడితులు

రెండు, మూడు రోజుల పాటు జ్వరం ఉన్నవారు ఏజ్వరమో తెలుసుకోవడానికి వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం ఆస్పత్రులకు వెళ్తున్నారు. కొంతమంది ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తుండగా మరి కొంత మంది ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఆస్పత్రుల్లో టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటున్నారు. కొంత మంది ఆస్పత్రులకు వెళ్లలేక మంచానపడి మూలుగుతున్నారు.

గత ప్రభుత్వంలో ఇంటింటా ఫీవర్ సర్వే

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటింటా ఫీవర్ సర్వేను ముందుగానే చేపట్టేవారు. జిల్లాలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు సర్వే చేసేవారు. వారికి వలంటీర్లు కూడా సహాయం చేసేవారు. ఇంటిలో ఎవరికైనా జ్వరం, దగ్గు, జలుబు ఉన్నాయా అని రెండు మూడు విడతలుగా సర్వే చేసేవారు. దీని వల్ల జ్వరపీడితులందరినీ గుర్తించి చికిత్స అందించడానికి వీలుండేది. మలేరియా, డెంగీ వంటి లక్షణాలుంటే వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించి, నిర్ధారణ చికిత్స అవసరమైన వారిని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించేవారు.

జిల్లాలో ఆచూకీ లేని సర్వే

గతంలో మాదిరి నేడు జిల్లాలో ఎక్కడా ఫీవర్ సర్వే జరగడం లేదని తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా జ్వరాల వ్యాప్తి ఎక్కువగా ఉన్నప్పటికీ బాధితులను గుర్తించి సేవలు అందడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో రెండు లక్షలకు పైగా జనం జ్వరాల బారిన పడ్డారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స కోసం అధికంగా జ్వరపీడితులు చేరి చికిత్స పొందుతున్నారు. కొంతమంది ఓపీలో చికిత్స తీసుకుంటుండగా, మరి కొంతమంది ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతున్నారు.

జ్వరాల వ్యాప్తి అరికట్టేందుకు చర్యలు

జిల్లాలో ఫీవర్ సర్వే చేపట్టాం. అవసరమైతే మరోసారి సర్వే చేయిస్తాం. జ్వరాల వ్యాప్తిని అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం.

డాక్టర్ ఎస్.జీవనరాణి, డీఎంహెచ్‌ఓ

సోషల్ మీడియా పోస్టులపై ఎస్పీ కన్నెర్ర

- అనుచిత పోస్టులు పెడితే కఠిన చర్యలు
- నెటిజెన్స్‌కు హెచ్చరిక



ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా సోషల్ మీడియాలో అనుచితమైన పోస్టులు పెట్టవద్దని ఎస్పీ వకుల్‌జిందల్ కోరారు. కుల, మత, రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వారిపైన, వారిని ప్రోత్సహించే వారిపైనా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని బుధవారం ఆయన హెచ్చరించారు. సోషల్ మీడియా ప్రభావం తీవ్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో వాస్తవాలను వక్రీకరిస్తూ మతాలను, కులాలను, రాజకీయ పార్టీలను రెచ్చగొడుతూ ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇనస్టాగాం, యూట్యూబ్, టెలిగ్రాం, వాట్సాప్, లింకిడిన్ వంటి ద్వారా మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై జిల్లా పోలీసుశాఖ ప్రత్యేకంగా నిఘా పెట్టిందన్నారు. ఇందుకుగాను ఒక పోలీసు బృందాన్ని ప్రత్యేకంగా నియమించి, సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. కాగా జిల్లాలోని డెంకాడ మండలం టి.కళ్లాలు (చిన మోపాడ)లో ఓ ప్రార్థనా మందిరం ఆవరణలో ఉన్న విగ్రహంపై చెట్టు కొమ్మ పడి విగ్రహం పాడైపోతే, ఓ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి సోషల్ మీడియాలో పోస్టు పెట్టడంపై డెంకాడ పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టి, అరెస్టు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వినియోగిస్తున్న ప్రజలు విజ్ఞతతో వ్యవహరించాలని కోరారు. వాస్తవాలను తెలుసుకోకుండా సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టేటపుడు ఇతరుల మతాలు, కులాలు, మనోభావాలకు, వ్యక్తిత్వానికి భంగం కలిగించకుండా ఉండాలని హితవు పలికారు.

పోటా పోటీగా హ్యాండ్‌బాల్ పోటీలు



హ్యాండ్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

శృంగవరపుకోట: మండలంలోని కిల్తంపాలెం జవహర్ నవోదయ విద్యాలయలో హైదరాబాద్ రీజియన్ హ్యాండ్‌బాల్ మీట్ -2025-26 పోటీలు రెండవ రోజు మంగళవారం హోరాహోరీగా సాగాయి. పోటీల్లో 195 మంది, బాలురు, 183 మంది బాలికలు అండర్-19, అండర్-17, అండర్-14 విభాగాల్లో తలపడుతున్నారు. పోటీలకు వచ్చిన దక్షిణ భారతదేశంలోని నవోదయ విద్యాలయాలైన యానాం, ఆదిలాబాద్, కన్నూర్, కరైకల్, ఎర్నాకుళం, హవేరి, హాసన్, కలబుర్గిల నుంచి వచ్చిన విద్యార్థులు పోటాపోటీగా తలపడుతున్నారు. గురువారం విజేతలను నిర్ణయించి బహుమతి ప్రదానం చేస్తామని, విజేతలు బీహార్‌లో నలందలో నిర్వహించనున్న జాతీయ పోటీల్లో పాల్గొంటారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్.రాజారావు చెప్పారు.

హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్‌పై రైతుల అభ్యంతరం



రైతులతో సమావేశమైన ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుధాసాగర్

లక్కవరపుకోట: ఇప్పటికే విలువైన పంట భూములను ఐఓసీఎల్ పైప్‌లైన్, హైపవర్ విద్యుత్ లైన్, గ్రీన్ ఫీల్డ్ హైవే తదితర ప్రాజెక్టుల కోసం లాక్కున్నారని పరిహారం మాత్రం తూతూ మంత్రంగా అందించారని మరో ప్రాజెక్టుకు భూములను ఇచ్చేందుకు సిద్ధంగా లేమని రైతులు తేల్చి చెప్పారు. ఈ మేరకు లక్కవరపుకోట మండల కేంద్రంలో గల ఎంపీడీఓ కార్యాలయంలో విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్‌కు హిందుస్థాన్ పెట్రోల్ కార్పొరేషన్ కు చెందిన పైప్ లైన్ నిర్మాణానికి సంబంధించి శ్రీరాంపురం, కొట్యాడ, కూర్మవరం గ్రామాల రైతులతో అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్.సుధాసాగర్ సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విలువైన పంట భూముల్లో అడ్డుగా పైప్‌లైన్ వేస్తే భవిష్యత్ అవసరాలకు భూములను అమ్ముకోదలిస్తే కొనేందుకు ఎవరూ ముందుకు రారని వాపోయారు. పైప్‌లైన్ నిర్మాణానికి సేకరించిన భూమికి మార్కెట్ విలువలో కేవలం 10 శాతం మాత్రమే పరిహారం చెల్లించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పైప్‌లైన్ నిర్మాణానికి భూములు ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు తెగేసి చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ డిప్యూటీ మేనేజర్ ఎం.లక్ష్మణ్, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, విశ్రాంత తహసీల్దార్ జి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 3న జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో ఆగస్టు 9,10,11 తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలో జరగనున్న జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక ఆగస్టు 3న నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం తెలిపారు. నగర శివారులో గల విజ్జి స్టేడియంలో నిర్వహించే ఎంపికల్లో అండర్-14,16,18,20 సంవత్సరాల వయస్సు గల బాల, బాలికలు పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకురావాలని సూచించారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికకు నోటిఫికేషన్



ఎన్నికల నోటిఫికేషన్‌ను నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తున్న సంఘం నాయకులు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఎన్నికలు రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు వచ్చేనెల 16న స్థానిక జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో నిర్వహిస్తామని ప్రస్తుత జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.మురళి, ఎ.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎన్నిక నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేసి జిల్లా శాఖ కార్యాలయం నోటీస్ బోర్డులో ప్రదర్శనకు ఉంచినట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఎన్నికలకు పరిశీలకులుగా విశాఖ జిల్లా పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, తూర్పుగోదావరి జిల్లా ఏపీఎన్‌జీజీఓ జాయింట్ సెక్రటరీ ఎస్ఎంకేజీప్రసాద్ వ్యవహరిస్తారని తెలిపారు. ఎన్నికల అధికారిగా విజయనగరం జిల్లా ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు టి.శ్రీధర్‌బాబు, సహాయ ఎన్నికల అధికారిగా విజయనగరం జిల్లా పట్టణ ఏపీఎన్‌జీఓ అసోసియేట్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు నియమితులయ్యారని పేర్కొన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని అన్ని తాలూకా యూనిట్‌లలో ఉన్న ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొనాలని ఎన్నికల అధికారి శ్రీధర్ కోరారు. నోటిఫికేషన్ విడుదల కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, రమణమూర్తి, ఆంజనేయ వర్మ, పరిషత్ యూనిట్ అధ్యక్షులు కేఎస్‌శ్రీనివాసరావు, ఎల్వీ ప్రసాద్, వీవీరమణమూర్తి, ఎం.హేమలత, వనిత, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా వ్యవస్థీకృత నేరం

- సీనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రసాద్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్

విజయనగరం లీగల్: మానవ అక్రమ రవాణా హేయమైన చర్య అని ఇది వ్యవస్థీకృత నేరమని ఈ దోపిడీని అంతం చేయాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు.ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నగరంలోని మహిళా ప్రాంగణంలో బుధవారం న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మహిళలు చిన్నపిల్లలను అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అక్రమ రవాణా బాధితుల హక్కుల రక్షణ వారి భద్రతలే ప్రధాన అంశంగా పోలీస్ యంత్రాంగం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ పనిచేస్తుందని అక్రమ రవాణా బాధితులకు రక్షణ నష్టపరిహారం, పునరావాసంతో పాటు వారికి తగిన న్యాయ సహాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థతో పాటు పోలీసు యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. పిల్లల అక్రమ రవాణాపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ మహిళా పోలీస్ స్టేషన్ ఆర్.గోవిందరావు మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి టి.విమల కుమారి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్‌డీవీ ప్రసాద రావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ జి హిమబిందు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బీహెచ్ లక్ష్మి, పోలీస్ అధికారులు, యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ప్రసాద రావు పాల్గొన్నారు.

గిరిజనులకు రగ్గుల పంపిణీ



ఉపముఖ్యమంత్రి పంపిన రగ్గులతో గిరిజనులు

మక్కువ/పార్వతీపురం రూరల్: మక్కువ మండలంలోని ఆరు గిరిజన గ్రామాలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రగ్గులను పంపించారు. ఈ మేరకు బుధవారం ఆ 6 గిరిజన గ్రామాల్లో రగ్గుల పంపిణీ జరిగింది. మండలంలోని బాగుజోలలో 24, చిలక మెండంగి, బెండమెడంగి, తాడిపుట్టి, దోయ్ వర, సిరివర, గిరిజన గ్రామాల్లో 222 కుటుంబాలకు, కుటుంబానికి మూడు రగ్గులు చొప్పున పంపిణీ చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పెద్ద పీట

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొరను కలిసిన వైఎస్సార్‌సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ

సాలూరు: రానున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీ కార్యకర్తలకు పెద్దపీట వేయనున్నట్లు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు రాజన్నదొరను పట్టణంలోని ఆయన స్వగృహంలో బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ ,శ్రీకాకుళం,పార్వతీపురం మన్యం జిల్లాల అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్ వీర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల కమిటీల నియామకంపై చర్చించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జిల్లా, మండల స్థాయి అనుబంధ విభాగాల కమిటీల నియామకం ఇప్పటికే పూర్తయిందన్నారు. గ్రామ, వార్డు స్థాయి కమిటీల నియామకం త్వరలోనే పూర్తిచేస్తామని చెప్పారు. మంగళవారం తాడేపల్లిలో జరిగిన పీఏసీ సమావేశంలో అంశాలపై మాట్లాడారు. ముఖ్యంగా రానున్న జగన్‌మోహన్ రెడ్డి పాలనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించి , వారే రాజు మంత్రి అనే విధంగా కార్యకర్తలను చూసుకుంటామని జగన్‌మోహన్‌రెడ్డి తెలిపిన విషయాలను ప్రస్తావించారు. క్షేత్రస్థాయిలో కూటమి పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, సమస్యలపై చర్చించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



సూరిదేముడు మృతదేహం

గంట్యాడ: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే.. గంట్యాడ మండలంలోని రామవరం గ్రామానికి చెందిన కొల్లి సూరిదేముడు (41) బుధవారం ఉదయం 8:30 గంటల సమయంలో కాలకృత్యాల కోసం అయ్యన్నబంద చెరువుకు వెళ్లాడు. కాలు జారి చెరువులో పడిపోగా లోతు ఎక్కువగా ఉండడంతో మునిగిపోయాడు. అక్కడే ఉన్న రీసు అప్పన్న గ్రామంలోకి పరుగున వెళ్లి జనాలను తీసుకొచ్చి సూరిదేముడిని బయటకు తీయగా అప్పటికే మరణించాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కృష్ణ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


చెరువులో పడి మరో వ్యక్తి..



రమేష్ మృతదేహం

పార్వతీపురం రూరల్: మండలంలోని ఎమ్మార్‌నగరం గ్రామ శివారులో గల చిన్న రాయుడు చెరువులో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. బుధవారం మృతదేహం పైకి తేలి కనిపించడంతో స్థానికులు పార్వతీపురం రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రామంలోని బజారు వీధికి చెందిన సింగిరెడ్డి రమేష్ (35) పొలం పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ వ్యక్తి పశువులను శుభ్రం చేసేందుకు చెరువులో దిగి ఈత రాక ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఒక కుమార్తె ఉంది. జరిగిన సంఘటనపై ఎస్సై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పూసపాటిరేగ: మండలంలోని కందివలస సంత సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. కందివలస సంత ఏరియాలో భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్న వ్యక్తి మూర్ఛ వ్యాధితో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చికిత్స నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని పూసపాటిరేగ పోలీసులు కోరారు. ఈమేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదాత సుఖీభవలో కోత

- వైఎస్సార్‌సీపీ హయాంలో కంటే తగ్గిన లబ్ధిదారులు
- కూటమి పాలనలో అర్హులుగా గుర్తించింది 2.24 లక్షల మంది
- తగ్గిన 40 వేల మందికి పైగా లబ్ధిదారులు



విజయనగరం మండలం జొన్నవలసలో దమ్ము చేస్తున్న రైతు

విజయనగరం ఫోర్ట్: మెంటాడ మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన దేవర పాదాలమ్మకు వైఎస్సార్‌సీపీ హయాంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద సాయం అందింది. కూటమి ప్రభుత్వం సాయం ప్రకటించిన అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాలో ఆమె పేరు లేదు. ఆమెకు రెండున్నర ఎకరాల పొలం ఉంది.

- బొండపల్లి మండలం బిల్లల వలసకు చెందిన ఎన్.శ్రీనుకు గ్రామంలో 65 సెంట్ల పొలం ఉంది. వైఎస్సార్ సీపీ హయంలో ఈ రైతుకు రైతు భరోసా సాయం అందింది. కూటమి ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాలో ఈ రైతు పేరు లేదు.
- దత్తిరాజేరు మండలం వి.కృష్ణాపురం గ్రామానికి చెందిన మార్పిన సురేష్‌కు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పథకం కింద ఆర్థిక సాయం అందింది. కూటమి ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాలో ఆ రైతు పేరు లేదు. ఈ ముగ్గురు రైతులే కాదు. అనేక మంది రైతులకు ఎదురైన సమస్య ఇది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం అందుకున్న వారికి కూడా కూటమి ప్రభుత్వంలో పథకం అందని పరిస్థితి నెలకొంది. అన్నదాత సుఖీభవ పథకం కోసం ఎంపిక చేసిన జాబితలో వేలాది మందికి కూటమి ప్రభుత్వం కోత పెట్టిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రైతులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏడాదికి రూ.13,500 చొప్పున ఐదేళ్ల పాటు ఆర్థిక సాయాన్ని అందించింది. కానీ కూటమి సర్కార్ మొదటి ఏడాది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తానన్న ఆర్థిక సాయం అందించలేదు. రెండో ఏడాది అన్నదాత సుఖీభవ పథకం కూడా ఇంతవరకు అందించిన పాపాన పోలేదు. అన్నదాత సుఖీభవ పథకం ఇవ్వకపోయినప్పటికీ రైతులకు ఆర్థిక సాయం అందించడం కోసం అని చెప్పి గుర్తించిన లబ్ధిదారుల జాబితాలో భారీగా కోత విధించడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నమ్మి ఓట్లు వేస్తే ఈ విధంగా కోత పెట్టడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అప్పుడు అర్హులమై ఇప్పుడు ఏవిధంగా అనర్హులమ య్యామని రైతులు వాపోతున్నారు. లబ్ధిదారుల సంఖ్యను తగ్గించాలనే కుట్రతోనే కూటమి సర్కార్ ఈ విధంగా చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గత ప్రభుత్వంలో 2.63 లక్షల మంది రైతులకు లబ్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2.63 లక్షల మంది రైతులు లబ్ధి పొందారు. వారికి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రూ.13,500 చొప్పున ఆర్థిక సాయం అందించింది. కూటమి సర్కార్ అన్నదాత సుఖీభవ పథకం కోసం 2,24,356 మంది అర్హులను గుర్తించింది. ఇందులో 2,23,117 మందికి ఈకేవైసీ పూర్తయింది. 1239 మందికి ఈకేవైసీ చేయాల్సి ఉంది. 40 వేలకు పైగా లబ్ధిదారులు గతంలో కంటే తగ్గిపోయారు.

ఇంకా అందని సాగు సాయం

అధికారంలోకి వస్తే రైతుల సాగు పెట్టుబడికి ఆర్థిక సాయం చేస్తామని కూటమి సర్కార్ గొప్పలు చెప్పింది. గద్దె నెక్కిన మొదటి ఏడాదే రైతులకు ఇచ్చిన హామీని ఎగ్గొట్టింది. రెండో ఏడాది ఇంతవరకు సాయం అందించలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అయితే రైతులకు పంట పెట్టుబడికి డబ్బులు లేక పోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. అప్పులు చేసి పంటల సాగుకు పెట్టుబడి పెడుతున్నారు.